

RNI.NO. APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక
"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 56 | 27-10-2026 | మంగళవారం | పేజీలు -4 | వెల-రూ. 5



వైఎస్ జగన్‌కు షాక్‌ల మీద షాక్‌లు

గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా :

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన అధికారం కోల్పోయ్యారు. ఆ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. తాజాగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనకు గట్టి ఎదురు దెబ్బ తగులుతోంది. సొంత గడ్డ పులివెందులలో వైఎస్ జగన్‌కు టీడీపీ గట్టి ఝలక్ ఇచ్చింది. పులివెందులలో మొత్తం 40 మున్సిపల్ వార్డుల్లో 20 టీడీపీకి ఏకగ్రీవమయ్యాయి. మరో 20 వార్డులతో పాటు చైర్‌పర్సన్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. అలాగే జిల్లాలోని కడప కార్పొరేషన్‌తోపాటు 8 మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకుంది. జిల్లాలో 9కిగాను 6 మున్సిపల్ చైర్మన్ స్థానాలు టీడీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఇక కడప జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు.. రాజంపేట (టీడీపీ), ప్రొద్దుటూరు (టీడీపీ), బద్వేలు (టీడీపీ), మైదుకూరు (టీడీపీ)తో పాటు రెండు నగర పంచాయతీలు కమలాపురం (టీడీపీ), ఎర్రగుంట్ల(బీజేపీ) చైర్‌పర్సన్ పదవులను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచు కున్నాయి. రాజంపేటలో 32 వార్డుల్లో..14 టీడీపీకి, ఒకటి జనసేనకు ఏకగ్రీవమయ్యాయి. ప్రొద్దుటూరులో 52 వార్డుల్లో.. టీడీపీ అభ్యర్థులు 51చోట్ల, బీజేపీ అభ్యర్థి ఓ చోట ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బద్వేలులో 40 వార్డుల్లో టీడీపీ 35, జనసేన 2 ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. ఇద్దరు ఇండిపెండెంట్లు కూడా పోటీ లేకుండా గెలిచారు. దీంతో నవంబర్1న 39వ వార్డులో మాత్రమే ఎన్నిక జరుగనుంది. మైదుకూరులో 32 వార్డులకు 17 చోట్ల టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. కమలాపురం నగర పంచాయతీలో 23 వార్డుల్లో.. టీడీపీ 22 ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఓ వార్డులో బీజేపీ ఏకగ్రీవమైంది. ఎర్రగుంట్ల నగర పంచాయతీలో 28 వార్డుల్లో.. టీడీపీకి 17, బీజేపీకి 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 7వ వార్డుకు ఎన్నిక జరగనుంది. కడప కార్పొరేషన్‌లో 66 డివిజన్లున్నాయి. ఇందులో టీడీపీ 47, బీజేపీ 2, జనసేన 1 వార్డుల్లో ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ మేయర్ స్థానంతో పాటు మరో 16 డివిజన్లకు ఎన్నిక జరగనుంది.



తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. డీఎంకే సీనియర్ నేత, మాజీ విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యమొళిని చెన్నైసెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు అరెస్టు చేశారు. ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపు విషయంలో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు శాశ్వత గుర్తింపు, అప్‌గ్రేడేషన్, భవన నిర్మాణ అనుమతులు, నో-అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు భారీగా వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు ప్రారంభమైంది. తమిళనాడు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.టి. అరసుమ కుమార్ తదితరులు ఈ వసూళ్లకు పాల్పడినట్లు ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య కార్యదర్శి ఇళంగోవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా డిజిటల్ పరికరాల ద్వారా సేకరించిన ఆధారాలు, పలువురి వాంగ్మూలాల ఆధారంగా డీఎంకే ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసినా అన్బిల్ మహేశ్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు ఇవాళ(సోమవారం) కొట్టేసింది. హైకోర్టు బెయిల్ నిరాకరించిన గంటల వ్యవధిలోనే సీసీబీ ప్రత్యేక బృందాలు ఆయనను అరెస్టు చేశాయి. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను మాజీ మంత్రి ఖండించగా.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే టీవీకే పార్టీ అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుందని డీఎంకే మండిపడింది. ఈ మొత్తం కుంభకోణంలో ప్రస్తావనకు వచ్చినా 177 పాఠశాలలపై పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.

రఘురామకృష్ణంరాజుకు సుప్రీం షాక్



గ్లోబల్ వార్త - అమరావతి

టీడీపీ నేత, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రూ. 237 కోట్ల మేర బ్యాంకులను మోసం చేసి, నిధులను పక్కదారి పట్టించిన కేసులో తనపై ఉన్న సీబీఐ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ (క్వాష్ పిటిషన్) వేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు నిర్దాక్షిణ్యంగా కొట్టివేసింది. ఇన్నాళ్లూ మీడియా ముందుకు వచ్చి నీతులు వల్లించిన రఘురామకృష్ణంరాజు ఆర్థిక అక్రమాలు, బ్యాంకుల దోపిడీ బండారం సుప్రీంకోర్టు తీర్పుతో పూర్తిగా బట్టబయలైంది.

ఏంటి ఈ రూ. 237 కోట్ల బ్యాంక్ స్కామ్

– ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ పేరుతో పవర్ ప్లాంట్ల ఏర్పాటు, వ్యాపార అవసరాల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం నుంచి రఘురామ రూ. 237.84 కోట్లు రుణాలుగా పొందారు.

– ఈ రుణనిధులను అసలు ప్రాజెక్టులకు వాడకుండా, నకిలీ కొనుగోలు పత్రాలు, తప్పుడు అకౌంట్లను సృష్టించి గ్రూప్ కంపెనీలకు మళ్లించారని బ్యాంకులు ఆధారాలతో ఫిర్యాదు చేశాయి.

– ఈ భారీ కుంభకోణంపై రంగంలోకి దిగిన సీబీఐ.. రఘురామకృష్ణంరాజు, ఇతర డైరెక్టర్లపై ఐపీసీ సెక్షన్లు 120-బీ (కుట్ర), 420 (మోసం), 467, 468, 471 (ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి)తో పాటు అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసింది.

సుప్రీంకోర్టు ఘాటు ఆదేశాలు..

– జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆర్థిక నేరాల విచారణలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

– గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం దర్యాప్తు అధికారి 16 వారాల్లోగా పూర్తిస్థాయి విచారణను పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలన్న ఉత్తర్వులను యథాతథంగా సమర్థించింది.

– రఘురామకృష్ణంరాజుతో పాటు ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ డైరెక్టర్లు కనుమూరు ఇందిరా ప్రియదర్శిని, రమాదేవి, దుంపల మధుసూధన రెడ్డి, అంబేద్కర్ రాజ్ కుమార్ గంటా, నారాయణ ప్రసాద్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లన్నింటినీ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

– పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదిస్తూ.. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, స్వతంత్ర డైరెక్టర్ల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని చెప్పగా, "ఈ వాదనలను హైకోర్టులోనే ఎందుకు వినిపించ లేదు? అని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నేరుగా ప్రశ్నించింది.

ముగిసిన రఘురామ అక్రమాల ద్రామా

– గతంలో ఈ సీబీఐ కేసును రద్దు చేయాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆర్థిక నేరాల దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున జోక్యం చేసుకోలేమని హైకోర్టు పిటిషన్లను కొట్టివేసి, సీబీఐకి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. దీంతో మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన రఘురామ కృష్ణంరాజు గ్యాంగ్‌కు అక్కడ కూడా గట్టి షాక్ తగిలింది.

– సుప్రీంకోర్టు తీర్పుతో సీబీఐ విచారణ వేగవంతమై, రఘురామకృష్ణంరాజు కట కటాల పాలయ్యే రోజులు దగ్గరపడ్డాయని స్పష్టమవుతోంది.

వేంపల్లి మండలంలో నాలుగు నామినేషన్ల ఉపసంహరణ


వైఎస్సార్‌సీపీ, టీడీపీ నుంచి చెరో ఇద్దరు అభ్యర్థులు వెనక్కి

గ్లోబల్ వార్త - వేంపల్లె

వేంపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో సోమవారం నాలుగు నామినేషన్లు ఉపసంహరణకు గురయ్యాయి. వీరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు, తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఉన్నారు.వేంపల్లి-5 ఎంపీటీసీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వల్లెపు నీలావతి, ముత్తుకూరు ఎంపీటీసీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చప్పిడి రోజా, టీడీపీ అభ్యర్థి రామిరెడ్డి సంజీవమ్మ, అలవలపాడు ఎంపీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి లింగాల నిర్మల జ్యోతి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణతో ఎన్నికల పోటీ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో ఆయా స్థానాల్లో తుది బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది.

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోండి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



గ్లోబల్ వార్త - అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని పార్టీ అగ్రనేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో లభించిన అద్భుత విజయం తర్వాత.. ఇచ్చిన హామీలను నెరవట్టరుస్తూ వస్తున్నా మని అన్నారు. అందుకే 'చెప్పాం-చేస్తున్నాం' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై వారికి దిశానిర్దేశం చేశారు. మిత్రధర్మాన్ని పాటించి తీరాల్సిందేనని.. అందులో ఎలాంటి వెసులుబాటూ లేదని ఈ సందర్భంగా వారికి ఏపీ సీఎం తేల్చి చెప్పారు. 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి ప్రజల వద్దకు వెళ్తున్నామని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్రం, స్థానికంగా.. ఇలా మూడు స్థాయిల్లోనూ ఒకే ప్రభుత్వం ఉంటే కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని సోదాహరణతో వివరించారు. అగ్రనేతలు మొదలుకుని.. కార్యకర్త వరకు చేసే పనిని రికార్డ్ చేస్తున్నామని తెలిపారు. పొత్తులు, రిజర్వేషన్ల కారణంతోపాటు సోషల్ రీ-ఇంజనీరింగ్‌లో భాగంగా కొంత మందికి అవకాశాలు దక్కలేదని వివరించారు. రాష్ట్రం, పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపునిస్తామని.. వారిని నామినేటెడ్ పదవులతో గౌరవిస్తామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికీ.. ప్రతి ప్రాంతానికీ లబ్ధి చేకూర్చేలా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రికార్డులు సృష్టించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందని వారికి వివరించారు.

తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాల హెచ్చరికలు ముందస్తు సన్నద్ధత చర్యలు

వాతావరణ వ్యవస్థ, గమనం

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలపడింది

ఇది అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగామారి, అక్టోబర్ 26 ఉదయానికల్లా పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తుపానుగారూపాంతరం చెందే అవకాశం ఉంది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ, అక్టోబర్ 28 ఉదయానికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలో పశ్చిమ-మధ్య బంగాళాఖాతానికి చేరుకుం టుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 27 నుండి 29 వరకు ఉత్తర కోస్తాంధ్రలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

3.తేదీల వారీగా వర్షపాతం, గాలుల వివరాలు:

27 అక్టోబర్ 2026:

అత్యంత భారీ వర్షాలు : విశాఖపట్నం, అనకాపల్లి.భారీ నుండి అతి భారీ వర్షాలు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా.

భారీ వర్షాలు ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల.

గాలుల వేగం: ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి గంటకు 70 నుండి 80 కి.మీ. వేగంతో, గరిష్టంగా 90 కి.మీ. వరకు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

28 అక్టోబర్ 2026:

అత్యంత భారీ వర్షాలు:

అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి.

భారీ నుండి అతి భారీ వర్షాలు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా.

భారీ వర్షాలు: గుంటూరు, బాపట్లలో గాలుల వేగం: కోస్తాంధ్ర తీరంలో గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో, గరిష్టంగా 60 కి.మీ. వరకు గాలులు వీస్తాయి.

29 అక్టోబర్ 2026:భారీ వర్షాలు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

గాలుల వేగం: కోస్తాంధ్రలో గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో, గరిష్టంగా 60 కి.మీ. వరకు గాలులు కొనసాగుతాయి.

4.మత్స్యకారులకు హెచ్చరికలు: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు అక్టోబర్ 24 ఉదయానికల్లా వెంటనే తీరానికి తిరిగి రావాలి. అక్టోబర్ 23 సాయంత్రం నుండి అక్టోబర్ 26 వరకు తూర్పు-మధ్య మరియు ఆగ్నేయ బంగాళాఖాతంలోకి వెళ్లకూడదు. అక్టోబర్ 26 నుండి అక్టోబర్ 28 వరకు పశ్చిమ-మధ్య, వాయువ్య మరియు నైరుతి బంగాళాఖాతంలోకి చేపల వేటకు వెళ్లరాదు. అక్టోబర్ 27 నుండి ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా తీరాల వెంబడి సముద్రంలోకి వెళ్లవద్దని కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడమైనది.

జెన్‌జీ, జెన్ ఆల్ఫా తరానికి ధోనీ సందేశం...4లో

ఘనంగా వాల్మీకి మహర్షి జయంత్యోత్సవం



గ్లోబల్ వార్త - పెనుగొండ

పెనుకొండ టీడీపీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంత్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ 2017లో జీవో ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుది అని అన్నారు. చరిత్రాత్మక రామాయణ గ్రంథాన్ని అందించిన మహానీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. వాల్మీకి రామాయణం భార్యాభర్తల బంధానికి, కుటుంబ బంధాలకు, నేటి సమాజానికి ఎంతో ఆదర్శమన్నారు. వాల్మీకి/బోయ కులస్తులకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మంత్రి చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకి, బోయలకు ప్రాధాన్యమిచ్చామన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే అని తెలిపారు. పెనుకొండలో వాల్మీకి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు బీసీలకు అండగా నిలిచారన్నారు. బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ ఎన్నికలైనా టీడీపీకి, కూటమికి బీసీలు అండగా ఉంటూ వస్తున్నారని మంత్రి సవిత పేర్కొన్నారు.

ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠానికి రూ.25 కోట్లు!

గ్లోబల్ వార్త - ఒంగోలు


స్థానిక పదవులకు కోట్లలో బేరాలు.. పోటీదారులను నిలువరించేందుకు దౌర్జన్యాలు.. నామినేషన్ల దశలోనే అడ్డగింతలు! ఉమ్మడి ప్రకాశం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజాస్వామ్యంపై ఆందోళన కలిగిస్తున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ నేతలు పదవులను ఆర్థిక లబ్ధికి మార్గంగా మార్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రూ.25 కోట్ల వరకు బేరం సాగిందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవుల నుంచి జెడ్పీటీసీ, ఎంపీపీ, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాల వరకు రేట్లు నిర్ణయించారనే చర్చ సాగుతోంది.

కోట్ల బేరాలకు తెర..

ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠానికి రూ.25 కోట్లు, మార్కాపురం జెడ్పీ స్థానానికి రూ.10 కోట్లు, మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు బేరాలు సాగినట్లు ప్రచారం జరుగుతోంది. కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు, జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు ధరలు నిర్ణయించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారాల వెనుక పార్టీలో పై స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

నామినేషన్లకే అడ్డంకులు..

మరోవైపు ఎన్నికల్లో ప్రత్యర్థులు పోటీ చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా పలు ప్రాంతాల్లో దాడులు, బెదిరింపులు, నామినేషన్లకు అడ్డంకులు ఎదురయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దర్శి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారు. బయటి ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి భయానక వాతావరణం సృష్టించారు. మహిళా అభ్యర్థులపైనా దాడులకు పాల్పడ్డారు. కొన్ని చోట్ల నామినేషన్ కేంద్రాలకు వెళ్తున్న అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను చించివేయడం, దాడులకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ల పరిశీలనలోనూ తమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




రక్షణ కల్పించాల్సిన పోలీసులే అడ్డంకులా?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు భద్రత కల్పించి, స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేలా చూడాల్సిన పోలీసులపైనా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకున్నారని వైఎస్సార్ సీపీ ఆరోపిస్తోంది. కొన్నిచోట్ల పోలీసుల సమక్షంలోనే ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని, అభ్యర్థులపై దాడులు జరిగినా తగిన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తోంది.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీధర్ చెరుకూరి



గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చే ప్రవర్తనా నియమావళి నిబంధనలను ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, సామాజిక మాధ్యమాలు, ముద్రణ, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు గౌరవించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వంటి కీలక దశలు కొనసాగుతున్న నేపథ్యంలో, తదుపరి ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర దశల్లోనూ ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో రాజకీయ తటస్థతను పాటించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.రాజకీయ కార్యకలాపాలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది రాజకీయంగా పూర్తి తటస్థతను పాటించాలి. ఏ రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం, రాజకీయ సమావేశాలు, ర్యాలీల్లో పాల్గొనడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేసే పోస్టులు పెట్టడం, వాటిని పంచుకోవడం, ఇష్టపడినట్లు గుర్తించడం, వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు చేపట్టకూడదు.ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు.ప్రభుత్వ వాహనాలు, నిధులు, కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ అతిథి గృహాలు, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. ప్రభుత్వ నిధులతో అధికార పార్టీ విజయాలు, పథకాలను ప్రచారం చేసే ప్రకటనలు జారీ చేయకూడదు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించడం, కొత్త పథకాలు ప్రారంభించడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిర్వహణకు ప్రభుత్వ అధికారులు సహకరించరాదు.అధికారిక పర్యటనల్లో ఎన్నికల ప్రచారానికి తావివ్వరాదు.మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంతో ముడిపెట్టినప్పుడు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వారికి సహకరించరాదు. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన అనుమతులు పొందిన తరువాతే చర్యలు చేపట్టాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని సూచించారు.నగదు, విలువైన వస్తువుల తరలింపులో నిబంధనలు పాటించాలి. ఎన్నికల సమయంలో నగదు, బంగారం, వెండి, బహుమతి వస్తువులు తదితరాలను అనుమానాస్పదంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్ణీత పరిమితులకు మించి నగదు లేదా విలువైన వస్తువులను తీసుకెళ్లాల్సిన సందర్భాల్లో సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు నిర్వహించినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలను అందించి సహకరించాలి.పోలింగ్ కేంద్రాల్లో నిష్పాక్షికంగా వ్యవహరించాలి. పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడకూడదు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలి. పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు స్లిప్పులు తెల్ల కాగితంపై మాత్రమే ఉండేలా, వాటిపై రాజకీయ పార్టీ గుర్తులు లేదా అభ్యర్థుల పేర్లు లేకుండా చూడాలి. ఎన్నికల విధుల్లో ఉన్న ఉన్నతాధికారులు, తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలి.నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు... ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించినా సంబంధిత నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు చేపట్టే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు...

నేడు పులివెందులలో వైఎస్ జగన్ రెండు రోజుల పర్యటన



గ్లోబల్ వార్త - పులివెందుల

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబరు 27, 28 తేదీల్లో (మంగళ, బుధవారాలు) పులివెందులలో పర్యటించ నున్నారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం పులివెందులకు చేరుకుంటారు. (మంగళవారం) ఉదయం 10:30 గంటల నుంచి పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను స్వయంగా కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిణామాలు, వరుస ఏకగ్రీవాల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్యాంశాలపై పార్టీ శ్రేణులతో ఆయన కీలక చర్చలు జరపనున్నారు.రెండు రోజుల పర్యటన ముగించుకున్న అనంతరం ఆయన తిరిగి తాడేపల్లికి బయలుదేరుతారు.



ఇంటింటా ప్రచారంలో వైయస్ ప్రమీలమ్మ , వైయస్ శిల్పా రెడ్డి

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధితోపాటు, ప్రజలకు అండగా ఉంటానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి వైయస్ ప్రమీలమ్మను కౌన్సిలర్ అభ్యర్థులను, ఆదరించి ఆశీర్వదించాలని వార్డు ప్రజలను కోరుతూ ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు, మంగళవారం,పులివెందుల లోని స్థానిక 38వ వార్డులో ప్రచారంలో వైయస్ ప్రమీలమ్మ వైయస్ శిల్పా రెడ్డి మరియు శ్యామల, మరియు వైఎస్ఆర్సిపి శ్రేణులు మహిళా కార్యకర్తలు పాల్గొని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి చైర్మన్ అభ్యర్థులను వార్డ్ కౌన్సిలర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలి అంటే ఒక వైసీపీ తోనే సాధ్యమవుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటు ఫ్యాన్ గుర్తుకు వేసి ఆశీర్వదించాలని వార్డు ప్రజల అభ్యర్థించారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మహిళా కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరాభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి

గ్లోబల్ వార్త- నెల్లూరు

నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని సంబంధిత నాయకుడు తెలిపారు. 'చెప్పాం.. చేస్తున్నాం' కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలు తమ ఇళ్లకు సమీపంలోనే నడక, వ్యాయామం చేసుకునేలా నగరవ్యాప్తంగా పార్కులు, వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే 72 మంది కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతు తెలిపి నెల్లూరు అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా టిడిపి నేతలు



గ్లోబల్ వార్త - లింగాల

పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ విజయాల పరంపరను కొనసాగించడమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం లింగాల మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎమ్మనూరు సరళాదేవి ని గెలిపించాలని కోరుతు తుంగభద్ర హై లేవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగి రెడ్డి లింగాల మండలంలోని అక్కులగారి పల్లి, తెరణం పల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ప్రజలను నేరుగా కలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, టీడీపీ అభ్యర్థికి ఎందుకు మద్దతు ఇవ్వాలో తెలియజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, స్థానిక పరిస్థితులపై ఆరా తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు.పులివెందుల నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణను తమకు అనుకూలంగా మలుచుకుంటూ, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. సరళాదేవి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిస్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కడపటూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా

జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సోమవారం ఉదయం కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంద ర్శించి పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచన లు చేసి దిశానిర్దేశం చేశారు.మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జరగనున్న అభ్యర్థుల ప్రచారం ప్రశాంతంగా జరిగేలా తగిన ముందస్తు ప్రణాళిక తో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద దర్గా ఉరుసు నేపథ్యంలో గట్టి బందోబస్తు ఏర్పా టు చేయాలని, రాత్రిపూట గస్తీ, తనిఖీలు నిర్వ హించాలని ఆదేశి చారు. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలని సిఐ శ్రీహరిని ఆదేశిం చారు. ఎస్పీ వెంట కడప డిఎస్పీ టి.భవాని, టూటౌన్ ఎస్ఐలు కొండారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జమ్మలమడుగులో టిడిపి ప్రచారం



గ్లోబల్ వార్త - జమ్మలమడుగు :

జమ్మలమడుగు మునిసిపాలిటీ పరిధిలో 24,25,26 వార్డులలో ప్రచారం నిర్వహించిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మల మడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి,ఎక్స్ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి సోదరి ప్రశాంతి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంబాపురం రమణా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జన సేన నాయకులు నాగార్జున, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లి కార్జున, వార్డు అభ్యర్థులు వన్‌కుమార్, సాధకున్,చీణూ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ జట్లకు ఎంపికైన పులివెందుల ఆణిముత్యాలు

గ్లోబల్ వార్త - పులివెందుల

కడపలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపికల్లో పులివెందుల ప్రాంతానికి చెందిన ముగ్గురు యువ క్రీడాకారులు తమ అద్భుత ప్రతిభతో సత్తా చాటారు. రాయలసీమ క్రికెట్ అకాడమీలో, ప్రముఖ క్రికెట్ కోచ్ నిత్యానంద రెడ్డి మార్గదర్శకత్వంలో క్రమం తప్పకుండా కఠిన శిక్షణ పొందుతున్న ఈ ముగ్గురు కుర్రాళ్లు జిల్లా జట్లకు ఎంపికై ప్రాంత కీర్తిని చాటారు.

1.అండర్-17జట్టుకు బూచిపల్లి మహేంద్ర (ఫాస్ట్ బౌలర్):

పులివెందుల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బూచిపల్లి రఘునాథ్, వెంకటేశ్వరిల కుమారుడైన మహేంద్ర, తన నిలకడైన వేగంతో అండర్-17 జట్టులో ఫాస్ట్ బౌలర్‌గా స్థానం సంపాదించుకున్నాడు. భవిష్యత్తులో దేశం తరఫున ఆడటమే తన ఏకైక లక్ష్యమని మహేంద్ర ధీమాగా చెబుతున్నాడు.

2.అండర్-14జట్టుకు వేల్పుల కుశాల్ యాదవ్ (ఫాస్ట్ బౌలర్):

పులివెందుల పట్టణానికి చెందిన వేల్పుల గంగాధర్ యాదవ్, లక్ష్మి యాదవ్ ల కుమారుడైన కుశాల్ యాదవ్, అండర్-14 జట్టుకు ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు. పదునైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న కుశాల్ సైతం, భవిష్యత్తులో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించడమే తన కల అని చాటిచెప్పాడు.

3.అండర్-14జట్టుకు ముడిమేల సుదీపు రెడ్డి (బ్యాట్స్‌మెన్):

పెద్దముడియం మండలం ఉలవపల్లి గ్రామానికి చెందిన ముడిమేల సుభాష్ రెడ్డి, వెంకటేశ్వరిల కుమారుడైన సుదీపు రెడ్డి, అండర్-14 జట్టులో బ్యాట్స్‌మెన్‌గా తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. చక్కని బ్యాటింగ్ నైపుణ్యాలు కలిగిన సుదీపు రెడ్డి, భవిష్యత్తులో ఐపీఎల్ ఆడటమే తన అంతిమ లక్ష్యమని ప్రకటించాడు. ఈ ముగ్గురు యువ కిరణాల అద్భుత విజయాలపై వారి తల్లిదండ్రులు, కొత్తపల్లి, ఉలవపల్లి గ్రామ ప్రజలతో పాటు పులివెందుల పట్టణ, క్రీడాభిమానులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

శ్రీవారి సన్నిధిలో ఉపరాష్ట్రపతి



గ్లోబల్ వార్త- తిరుమల : భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సంప్రదా యాన్ని అనుసరిస్తూ ముందుగా శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్న అనం తరం శ్రీవారి ఆలయానికి చేరు కున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ ఉపరాష్ట్ర పతికి స్వాగతం పలికారు. అనంతరం ధ్వజ స్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి, ఆలయంలోని శ్రీ వకుళా మాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించు కున్నారు.

వేదాశీర్వచనం.. తీర్థప్రసాదాల అందజేత

దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఉపరాష్ట్రపతికి వేదా శీర్వచనం అందించారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజ నేయస్వామి వారిని కూడా ఉపరాష్ట్రపతి దర్శించుకున్నారు.

ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరణ



గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026 కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ రామ గోపాల్ గారు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్ ఫ్రీ నంబర్ 1064ను ప్రజలకు తెలియజేసే పోస్టర్లు మరియు స్టిక్కర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు మాట్లాడుతూ, అవినీతి నిర్మూలనలో ప్రజల భాగ స్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించడానికి ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు భయపడ కుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపు నిచ్చారు. అంతేకాకుండా, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను క్రింది ఫోన్ నంబర్ల ద్వారా కూడా తెలియజేయవచ్చని ప్రజలకు సూచించారు.

ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్: 1064

ఏసీబీ డీఎస్పీ, కడప -సెల్ నంబర్: 9440446191

ఏసీబీ ఇన్‌స్పెక్టర్, కడప-సెల్ నంబర్: 9490611024

ఏసీబీ కార్యాలయం, కడప-ల్యాండ్‌లైన్ నంబర్: 08562-244637

కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవినీతి నిరోధక చర్యలపై అవగాహన పెంపొందించడం, లంచం డిమాండ్ చేసే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలను ప్రోత్సహిం చడం, ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత మరియు జవాబు దారీతనాన్ని బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగరాజు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి సిరిమానోత్సవం

భక్తులకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు



గ్లోబల్ వార్త - అమరావతి : ఏపీలో పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా భక్తులకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తల్లి దీవెనలతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా.. 'ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, భక్తుల కొంగుబంగారం.. శ్రీ పైడి తల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా భక్తులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. అమ్మవారి చల్లని చూపు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలనీ.. ఆ తల్లి దీవెనలతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లి విరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను' అని పోస్టు చేశారు.

మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీ మిట్టమల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచామృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం మహా మంగళ హారతులు తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. సోమవారం పురస్కరిం చుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరిగిందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో టీడీపీకి భారీ షాక్

గ్లోబల్ వార్త - కల్లూరు :

కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక కల్లూరు: స్థానిక సంస్థలు ఎన్నికల వేళ కల్లూరు అర్బన్ 44వ వార్డులో టీడీపీకి భారీ షాక్ తగిలింది. గత 34 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతూ విసిగిపోయిన రెడ్డిపోగు అంజి, కుటుంబ సభ్యులతో పాటు దాదాపు 70 కుటుంబాలు ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగిన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం 44వ వార్డులో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చింది. కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో పెద్ద సంఖ్యలో కుటుంబాలు వైఎస్సార్‌సీపీ వైపు అడుగులు వేయడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పార్టీలో చేరిన వారందరికీ కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యకర్తలను ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.



కార్యక్రమంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, నగర మేయర్ అభ్యర్థి సుశీలమ్మ, మాజీ కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయండి

మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి



గ్లోబల్ వార్త - పులివెందుల

రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో, పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుకు వైసిపి బలపరిచిన చైర్పర్సన్ ప్రమీలమ్మ 24 వ వార్డు కౌన్సిలర్ ప్రభావతి అభ్యర్థులను గెలిపించాలని పులివెందుల మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి మరియు వైకాపా నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి, ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం, కొనసాగిస్తు, మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వ హించగా వార్డు ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి వార్డు ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం లోనే పులివెందుల మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిందని, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పథకాలు సంక్షే మాన్ని వివరిస్తూ,ప్రతి గడపను సందర్శిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి భరోసా కల్పిస్తూ ఫ్యాన్ గుర్తుకు తమ విలువైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ ప్రచార కార్యక్రమాలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరారెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ రాయవరం రామలింగయ్య అనారోగ్యంతో మృతి

గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా

వేంపల్లెలో వేంపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రాయవరం రామలింగయ్య అనారోగ్యంతో మృతి చెందారు.ఈ మేరకు సోమవారం కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి మృతుని స్వగృహంలో భౌతికకాయం వద్ద ఘన నివాళులర్పించారు.ఆయన మాట్లాడుతూ వేంపల్లె సర్పంచ్ గా గ్రామ పంచాయతీకి,ఆర్యవైశ్య సంఘానికి సలహాదారులుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

కోమన్నూతల గ్రామంలో మారెడ్డి భరత్ రెడ్డి, మారెడ్డి లత రెడ్డి ఎన్నికల ప్రచారం

గ్లోబల్ వార్త - లింగాల

లింగాల మండలంలోని కోమన్నూతల,చెరోపల్లే గ్రామలలో సోమవారం పులివెందుల నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ లిమారెడ్డి భరత్ రెడ్డి, పులివెందుల మండల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి లింగాల మండల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి సతీమణి, లింగాల మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవితో కలిసి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మారెడ్డి భరత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడులి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం బీటెక్ రవిలిలి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కోమన్నూతల గ్రామంలో ప్రజలను కలుసుకొని, వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని మారెడ్డి భరత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి,లింగాల మండల సింగిల్ విండో



అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, జొన్నల గడ్డ ధనుంజయ నాయుడు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు

ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు అరుణ్ బాబు, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

- **మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై సమగ్ర సమీక్ష**
- **స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం**
- **1,778 పోలింగ్ కేంద్రాలు.. 12,400 మందికి పైగా సిబ్బంది కేటాయింపు**
- **భారీ భద్రత నడుమ స్థానిక సంస్థల ఎన్నికలు**



గ్లోబల్ వార్త -పుట్టపర్తి

శ్రీ సత్యసాయి జిల్లాలో జరగనున్న మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు పి. అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సమక్షంలో ఎన్నికల నిర్వహణ, నామినేషన్లు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది కేటాయింపు, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (వీఒజ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జీఒజ) ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు.

మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లాలోని ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 218 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్:

పోలింగ్ తేదీ: నవంబర్ 1, 2026 (ఆదివారం)

పోలింగ్ సమయం: ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు

రీ-పోలింగ్: నవంబర్ 2, 2026 (సోమవారం)

ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన: నవంబర్ 3, 2026 (మంగళవారం), ఉదయం 8 గంటల నుంచి

ఆరు పట్టణ స్థానిక సంస్థల వివరాలు:

ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ మున్సిపాలిటీలు, మడకశిర నగర పంచాయతీ పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి.

మొత్తం వార్డులు: 218

మొత్తం ఓటర్లు: 3,85,168

పురుష ఓటర్లు: 1,89,303

మహిళా ఓటర్లు: 1,95,825

ఇతరులు: 40

మొత్తం పోలింగ్ కేంద్రాలు: 458

పోలింగ్ కేంద్రాల వర్గీకరణ:

సాధారణ కేంద్రాలు: 298

సున్నితమైన కేంద్రాలు: 101

అతి సున్నితమైన కేంద్రాలు: 59

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 3,298 మంది సిబ్బందిని కేటాయించారు. వీరిలో 23 మంది జోనల్ అధికారులు, 61 మంది రూట్ అధికారులు, 75 మంది ఎన్నికల అధికారులు, 63 మంది సహాయ ఎన్నికల అధికారులు ఉన్నారు. అదనంగా 71 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించగా, 36 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 351 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, సమాచారం కోసం 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నంబర్: 08555-289039.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లు ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి పరిధిలోని 32 మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

ఎన్నికల షెడ్యూల్:

నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన: అక్టోబర్ 27, 2026

పోలింగ్: నవంబర్ 3, 2026

ఓట్ల లెక్కింపు: నవంబర్ 5, 2026

నామినేషన్ల వివరాలు:

జిల్లాలో మొత్తం 32 జెడ్పీటీసీ స్థానాలకు 316 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 234 నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. అలాగే 397 ఎంపీటీసీ స్థానాలకు 2,521 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 1,949 నామినేషన్లు చెల్లుబాటయ్యాయి.

ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు:

మొత్తం ఓటర్లు: 11,65,917

పురుష ఓటర్లు: 5,66,776

మహిళా ఓటర్లు: 5,99,112

ఇతరులు: 29

మొత్తం పోలింగ్ కేంద్రాలు: 1,320

పోలింగ్ కేంద్రాల్లో 312 సాధారణ కేంద్రాలు, 469 సున్నితమైన కేంద్రాలు, 539 అతి సున్నితమైన కేంద్రాలుగా గుర్తించారు.

సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు:

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం 103 జోన్లు, 156 రూట్లుగా విభజించి మొత్తం 9,120 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలి

ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని సమావేశంలో చర్చించారు.ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత ఎన్నికల అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, జరిమానా

గ్లోబల్ వార్త - ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ హత్య కేసులో నేరం రుజువు కావడంతో, కడప గౌరవనీయ ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రమేష్ కుమార్ నిందితుడికి జీవిత ఖైదు, రూ. 50వేలు జరిమానా విధిస్తూ ఈరోజు తుది తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 5 సంవత్సరములు అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

ఘటన పూర్వాపరాలు:

మృతుడు కత్తి వెంకటరమణ ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరం గ్రామ సమీపంలోని శ్రీ సాయిరామ్ సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండేవారు. మానవతా దృక్పథంతో అనాథ అయిన ధనుష్ అనే యువకుడికి తానున్న ఫ్యాక్టరీలోనే ఆశ్రయం కల్పించి, కూలీ పనుల్లో చేర్పించారు.ఘటనకు ముందు నిందితుడైన ధనుష్ తన ఖర్చుల నిమిత్తం రూ. 500లు ఇవ్వాలని వెంకటరమణను కోరగా, ఆయన నిరాకరించారు. దీనితో వెంకటరమణపై కక్ష పెంచుకున్న ధనుష్, 2020 ఫిబ్రవరి 29 రాత్రి నుండి మార్చి 1 తెల్లవారుజాము మధ్య సమయంలో ఫ్యాక్టరీ ప్రాంగణంలోని తూర్పు వైపు ఖాళీ స్థలంలో నిద్రిస్తున్న వెంకటరమణ తలపై బలమైన ఆయుధంతో దాడి చేసి దారుణంగా హత్య చేసి పరారయ్యాడు.

పోలీసు విచారణ, ప్రాసిక్యూషన్ వాదనలు కోర్టు తీర్పు:

మృతుడి కుమారుడు కత్తి భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహానికి పంచనామా నిర్వహించి, నిందితుడిని అరెస్ట్ చేసి పకడ్బందీ సాక్ష్యాధారాలతో గౌరవ న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (స్పెషల్ పీపీ) జి.ఎస్. శైలజ హాజరై, సాక్షులను సమర్థవంతంగా ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించేలా బలమైన న్యాయవాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రమేష్ కుమార్, నిందితుడు ధనుష్‌పై హత్య నేరం రుజువైనట్లు నిర్ధారించి జీవిత ఖైదు, రూ. 50వేలు జరిమానా విధిస్తూ చరిత్రాత్మక తీర్పు వెలువరించారు.



పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసలు:

ఈ కేసులో ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ, నిందితుడికి త్వరితగతిన కఠిన శిక్ష పడేలా నిరంతరం శ్రమించిన వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన స్పెషల్ పీపీ జి.ఎస్. శైలజని, విచారణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిం చిన కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, కానిస్టేబుల్ శ్రీని వాసులు రెడ్డి, ఒంటిమిట్ట ఏఎస్ఐ సుబ్బయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినం దించారు.

జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంపై టీడీపీ నేతలతో రఘునాథరెడ్డి సమీక్ష

గ్రామస్థాయిలో సమన్వయంతో ప్రచారం నిర్వహించండి


గ్లోబల్ వార్త - వేంపల్లె

వేంపల్లె మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచార సరళి, ప్రచార కార్యక్రమాల నిర్వహణపై టీడీపీ మండల ఇన్‌చార్జ్ అజ్జగుట్ట రఘునాథరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సోమవారం వేంపల్లెలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎన్నికల ప్రచార ప్రణాళికపై సమీక్షించారు.ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని చర్చించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణుల భాగస్వామ్యంతో ప్రచారాన్ని విస్తృతం చేయడం, ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కార్యక్రమాలను చేపట్టడం వంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో వేంపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రామ మునిరెడ్డి, వేంపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు నామా వేమ కుమార్, వీరభద్ర, మొహమ్మద్, రాజా నాయక్, డక్క రమేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం

చంద్రబాబు శుభాకాంక్షలు



గ్లోబల్ వార్త – అమరావతి

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవాన్ని సోమవారం జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యూని వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న వారిందరికీ శుభాకాం క్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ శు భాకాంక్షలు తెలియ జేశారు. 'డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యా లయం 40వ వార్షికోత్సవం సందర్భంగా, రూబీ జూబ్లీ వేడు కలు జరుపుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, పరిశోధ కులు, సిబ్బంది అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. దివంగత శ్రీ ఎన్టీఆర్ సంకల్పంతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, పరి శోధన, ప్రజారోగ్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. నాణ్య మైన వైద్య విద్యతో సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణం. వైద్యం ఒక వృత్తి మాత్రమే కాదు.. ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. సాంకేతికత వైద్యానికి శక్తిని ఇస్తే.. మానవత్వం ఆ వైద్యానికి మరింత విలువ చేకూరు స్తుంది. 40 ఏళ్ల వైద్య సేవా స్ఫూర్తితో ఈ విశ్వవిద్యాలయం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

సాయికృష్ణ కేసులో మరో అడుగు

శ్మశానవాటిక సిబ్బందిని సుదీర్ఘంగా

గ్లోబల్ వార్త – అమరావతి



రౌడీషీటర్ గాదె సాయికృష్ణ కస్టోడియల్ మృతి కేసులో సీబీఐ అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. సాయి కృష్ణ ను చంపేసిన తర్వాత మృత దేహాన్ని దహనం చేసిన విజయ వాడ కృష్ణలంకలోని స్వర్గపురిని దర్యాప్తు బృందాలు ఆదివారం పరిశీలించాయి. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని ఎక్కడ భద్రపరుస్తారు? వాటి సర్వర్లు ఎక్కడుంటాయి? అనే విష యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మే నుంచి జూన్ నెలాఖరు వరకు ఎన్ని శవాలను దహన సంస్కారాలకు తీసు కొచ్చారనే వివరాలు సేకరించారు. కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విధుల్లో ఉన్న డేనియల్‌ను ప్రశ్నించారు. గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన జాబితాను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పులివెందుల సురేశ్ కుమార్, కోనేటి వెంకటరాజు ఇళ్లల్లో సోమవారం ఉదయం సోదాలు నిర్వహించే అవకాశం ఉంది.

మీవే ద్వంద్వ ప్రమాణాలు.. బీజేపీపై కాంగ్రెస్ మండిపాటు

గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ :

మోదీ కా బాప్' అంటూ బిహార్ రాజధాని పట్నాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై మంటలు చల్లారడం లేదు. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ నాన్న కూడా వెళ్లిపోతారు) అంటూ ఖర్గే చేసిన వ్య?ఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. మొదట బీజేపీ నేతలు ఖర్గేకు కౌంటర్ వేయగా.. తాజాగా కాంగ్రెస్ నేతలు కూడా బీజేపీపై ఎదురుదాడి చేశారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ జయంతి సభలో ఖర్గే ప్రసంగిస్తూ సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని మాట్లాడుతుండగా.. సభలో ఉన్న ఒక వ్యక్తి 'తిరుగుబాటు జరిగే వరకు మోదీ పదవి నుంచి దిగిపోరు' అని అరిచారు. దానికి ఖర్గే స్పందిస్తూ.. 'మోదీ నాన్న కూడా వెళ్లాల్సిందే' అని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఎన్డీయే నేతలు ఖర్గేపై తీవ్రస్థాయిలో మండిపడగా.. తాజాగా కాంగ్రెస్ నేతలు కూడా బీజేపీపై ఎదురుదాడి చేశారు. బీజేపీవి ద్వంద్వ ప్రమాణాలని ఖర్గే 'ఎక్స్'లో అన్నారు.

ఈ ఏడాది ఆగస్టు 8న కాంగ్రెస్ బహిరంగ సమావేశం తర్వాత బీజేపీ, ఆర్ఎస్ఎస్ శుద్ధీకరణ పూజ చేశాయి. అలా చేయడంపై చర్యలు తీసుకుంటామని బీజేపీ నేత జేపీ నడ్డా పార్లమెంటులో హామీ ఇచ్చారు. కానీ, తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బదులుగా రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకవైపు రాజ్యాంగాన్ని కాపాడతామని ప్రధాని నరేంద్ర మోదీ అంటారు. మరోవైపు అంటరానితనాన్ని ఆచరించే వారినే మీరు (బీజేపీ) కాపాడుతారు' అని ఖర్గే అన్నారు.



గ్లోబల్స్ కూడా ఆశ్చర్యపోయేలా వైసీపీ నాయకుల తీరు



ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

- ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలనే ఆలోచనే లేని వ్యక్తి జగన్
- ప్రశాంతంగా ఉన్న రాయలసీమలో జగన్ మళ్లీ ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకొస్తున్నాడు
- రాష్ట్రంలో జరుగుతున్నహింసకు జగన్ బాధ్యత వహించా
- నాడు నేరాలు -నేడు ప్రవచనాలు చెబుతున్న వైసీపీ

గ్లోబల్ వార్త – జమ్మలమడుగు

గత పది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో వైసీపీ నాయకులు అడ్డంకులు సృష్టిస్తూ, దుష్ప్రచారం చేస్తూ ఉన్నారు. వారి వైఖరి చూస్తుంటే "ఆడలేక మద్యలో ఓడినట్లు" అనే సామెత గుర్తుకు వస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ ఎద్దేవా చేశారు. సోమవారం టీడీపీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ తమ పత్రిక, ఛానల్, సోషల్ మీడియా, పెయిడ్ ప్రచారాల ద్వారా రాష్ట్రంలో ఏదో గందరగోళం జరుగుతున్నట్లు చిత్రీకరిస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ అబద్ధపు ప్రచారాన్ని చూస్తే గోబెల్స్ కూడా ఆశ్చర్యపోయేవాడు. సాక్షి పత్రిక, సాక్షి ఛానల్ ద్వారా జగన్మోహన్ రెడ్డి శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికలను విచ్ఛిన్నం చేసి రాష్ట్రాన్ని అస్థిరపరచాలనే దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఎన్నికల సంఘం కొన్ని ప్రాంతాల్లో, మైదుకూరు మున్సిపాలిటీలో మళ్లీ నామినేషన్లు వేయడానికి అవకాశం కల్పించింది. కడప, తిరుపతి, రాజంపేటలో నామినేషన్లు వేసిన వైసీపీ మైదుకూరులో ఒక్క స్థానానికి కూడా నామినేషన్ ఎందుకు వేయలేదో జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి. పుంగనూరు, పులివెందులలో జడ్పీటీసీలకు నామినేషన్లు వేసి, ఎంపీటీసీలకు వేయకుండా వదిలేశారు. ఇది కేవలం కోర్టుల్లో, ఎన్నికల సంఘంపై ఇబ్బంది కలిగించడానికే తప్ప ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేయాలనే ఆలోచన వారికి లేదు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న హింసాత్మక చర్యలకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలే కారణం. రెండు నెలల క్రితం ఆయనే "ఏకగ్రీవం అయితే ఇన్‌చార్జ్‌కు టికెట్ ఇవ్వము" అని చెప్పి కార్యకర్తలను రెచ్చగొట్టారు. ప్రశాంతంగా ఉన్న రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో మళ్లీ ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకొస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. మేనకోడలి పెళ్లికి భద్రత లేదని జగన్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారు. గతంలో తాడేపల్లిలో సంక్రాంతి, దసరా, క్రిస్మస్ సంబరాలు వందలాది మందితో జరుపుకున్నప్పుడు భద్రత గుర్తుకు రాలేదా? శుభకార్యాల్లో కూడా అడ్డుపడే ఆయన మానసిక స్థితి ఆలోచించదగినది. గతంలో తుపాకులు, బాంబులు చేతబట్టి ఊళ్లపై దాడులు చేసినవారు, పోలింగ్ బూత్‌లపై దాడులు చేసినవారు ఈరోజు శాంతి ప్రవచనాలు పలుకుతున్నారు. 2021 బాధితులకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది. అయినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బాబు సూచన మేరకు అణచుకొని శాంతియుతంగా ఉన్నారు. జడ్పీటీసీలకు వైసీపీ 1817 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ 2078 వేసింది. ఎంపీటీసీలకు వైసీపీ 20,556, తెలుగుదేశం పార్టీ 22,013 నామినేషన్లు వేశారు. మొత్తం జడ్పీటీసీలకు 5,724, ఎంపీటీసీలకు 51,902 నామినేషన్లు వచ్చాయి. ఇంతమంది నామినేషన్లు వేసిన తర్వాత కూడా "అడ్డుకుంటున్నారు" అని చెప్పడం వితండవాదనే. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఎన్నికలు జరగాలి. తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి ఎన్డీఏ అభ్యర్థులందరినీ గెలిపించాలని రాష్ట్ర ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

నేడు ఆర్థిక వ్యవస్థలపైనా యుద్ధాలు!

గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ



మోదీ టి కాలంలో ఆయుధాలతో సంప్రదాయ యుద్ధాలు మాత్రమే జరగవని, ఆర్థిక వ్యవస్థలపైనా యుద్ధాలు జరుగు తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. అందువల్ల దేశ బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ టెర్రరిస్టుల బారి నుంచి కాపాడు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భువనేశ్వర్‌లో రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఆర్బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రధా ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలపై దాడులతోనూ ఒక దేశాన్ని బలహీన పరచవచ్చని చెప్పారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ బలో పేతమవు తున్న ఈ తరుణంలో మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ క్రిమి నల్స్, సైబర్ టెర్రరిస్టుల దాడుల నుంచి కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కాలం చెల్లిన విధానాలు, శిక్షణ, టూల్స్ తో వీటిని ఎదుర్కోలేమని వివరించారు. అందుకు ఆధునిక వ్యవస్థలు, నైపుణ్యం గల మానవ వనరులు తప్పనిసరి అని పేర్కొన్నారు.

టీడీపీ నేతలపై దాడులు

జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్



గ్లోబల్ వార్త – తాడిపత్రి : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలపై దాడులు జరుగుతున్నా పట్టించు కోవడం లేదంటూ అనంత పురం జిల్లా పోలీసులపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీ సుల తీరుకు నిరసనగా ఆది వారం అర్ధరాత్రి వరకు తాడి పత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట తన అనుచరులతో కలిసి మంచం వేసుకుని ఆయన నిరసనకు దిగారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి.. జేసీ ప్రభాకర్ రెడ్డికి నచ్చ చెప్పారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపో యారు. అనంతపురం జిల్లాలోని శింగనమల నియోజక వర్గం యల్లనూరు మండలం తిమ్మంపల్లి, కొడవాండ్లపల్లి గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆయన ఆరోపించారు. వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యం లో దాడులు జరిగాయని పేర్కొన్నారు. మరో వైపు.. టీడీపీకి జిల్లా పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ రాప్తాడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండి పడ్డారు. పోలీసుల తీరును తప్పు పట్టారు. ఈ నేపథ్యంలో వారిపై సదరు వైసీపీ నేత తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.

మీ బాధను అర్థం చేసుకుంటా

ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ హామీ



గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ : ఢిల్లీలో ప్రతి వ్యాపారికీ అండగా ఉంటానని కాం గ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. ఢిల్లీ వ్యాపారుల బాధను అర్థం చేసుకుంటున్నామని ఎక్స్‌లో ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో సేవలను నిలిపివేసి, రహదారులను మూసివేసి, దేశ రాజ ధాని ఢిల్లీని దిగ్బంధం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఓటు చోరీ జరిగితే ఏదీ సురక్షితం కాదన్నారు. 'మీ (వ్యాపారులు) దుకాణం, మీ పొదుపు, మీ పిల్లల భవిష్యత్తు కూడా ప్రమా దంలో పడతాయి. ఓటుచోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఆయనను తొలగిస్తే 30 సెకన్లలోనే ఆందోళనలు ఆగిపోతాయి' అని రాహుల్ పేర్కొన్నారు.

పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్

గ్లోబల్ వార్త – పుట్టపర్తి : పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ అంకిత సురానా,పర్యవేక్షణలో, డిఎస్‌పి శ్రీనివాసులుఆధ్వర్యంలో పోలీసు ఆయుధాల ప్రదర్శన ను ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, పరికరాలు, సాంకేతిక సాధనలను గురించి పోలీసు అధికారులు విద్యార్థులకు వివరించారు. పోలీసు అమరులను స్మరించుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తెలియజేశారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు అందరూ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాలో పోలీసులు వాడే ఆయుధాలను ప్రదర్శన లో పెట్టి మొదలగు పరికరాలు అవి పనిచేయు విధానం గురించి పోలీసులు విద్యార్ధులకు వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం టీమ్ బృందాలతో ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మీరు విన్న వాటిని మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని,నేరాలకు మరియు నేరసాలకు పాల్పడే వ్యక్తులకు దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అనంతరం, స్క్రీన్ పై ప్రొజెక్టర్ ద్వారా పోలీస్ అమరవీరుల త్యాగాలు గురించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు , వీరన్న , ప్రదీప్ సింగ్ ,ప్రసాద్ తదితర అధికారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రస్తుత జెన్ జీ జెన్ ఆల్ఫా తరాలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సూచించారు. మారుతున్న జీవనశైలి, ఫాస్ట్‌ఫుడ్ అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం భవిష్యత్తులో ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చని హెచ్చరించారు. చిన్నప్పటి నుంచే క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, రోజులో కనీసం గంట సమయాన్ని ఫిట్‌నెస్ కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు.రచయిత, గేయరచయిత జావేద్ అఖ్తర్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ.. యువత ఆరోగ్యం గురించి కీలక విషయాలు పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాకారులు కావాల్సిన అవసరం లేదని, అయితే శారీరక చురుకుదనాన్ని జీవితంలో భాగం చేసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గతంలో ప్రజల దైనందిన జీవితంలో శారీరక శ్రమ ఎక్కువగా ఉండేదని ధోనీ గుర్తుచేశారు. అప్పటి ఆహారపు అలవాట్లు కూడా ఆ జీవనశైలికి అనుగుణంగా ఉండేవన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని వివరించారు. "గతంలో ఉన్న ఆహారపు అలవాట్లే ఇప్పటి తరానికి కొనసాగాయి. కానీ శారీరక శ్రమ మాత్రం గణనీయంగా తగ్గిపోయింది" అని ధోనీ పేర్కొన్నారు. గతంలో నడక, శారీరక శ్రమ రోజువారీ జీవితంలో సహజంగా భాగంగా ఉండేవని.. ఇప్పుడు చిన్న దూరాలకు వెళ్లేందుకు కూడా వాహనాలపై ఆధారపడుతున్నారని.. కార్యాలయాల్లో గంటల తరబడి కుర్చీలకే పరిమితమవుతున్నారని వివరించారు. దీనికి తోడు ఫాస్ట్‌ఫుడ్, చక్కెర అధికంగా ఉండే పదార్థాలు, నూనెలో వేయించిన ఆహారాల వినియోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమందిలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతున్నప్పటికీ.. సమాజంలోని ఎక్కువ మందికి ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందని ధోనీ అభిప్రాయపడ్డారు.

పిల్లలను ఆటల వైపు మళ్లించాలి..

పిల్లలను చిన్న వయసు నుంచే వివిధ క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ధోనీ సూచించారు. ఒకే ఆటకు పరిమితం చేయకుండా.. వారికి ఆసక్తి ఉన్న క్రీడలను ప్రయత్నించే అవకాశం ఇవ్వాలన్నారు. అలా పిల్లలు తమకు నచ్చిన ఆటను ఎంచుకోవడంతోపాటు శారీరక శ్రమకు అలవాటు పడతారని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రొఫెషనల్ క్రీడాకారులు కావాల్సిన అవసరం లేదని.. అయితే చిన్నప్పటి నుంచి క్రీడల్లో పాల్గొనడం జీవితాంతం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. "30--35 ఏళ్లు దాటిన తర్వాత క్రీడలు ఆడినవారు, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమిచ్చినవారు మధ్య వయసులో మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని మీరు గుర్తిస్తారు" అని ధోనీ పేర్కొన్నారు. వయసు పెరిగే కొద్దీ కుటుంబ బాధ్యతలు కూడా పెరుగుతాయని.. అలాంటి సమయంలో శారీరక దృఢత్వం ఎంతో ముఖ్యమని చెప్పారు. పిల్లలతో కలిసి ఆడుకోవడం వంటి రోజువారీ ఆనందాలను ఆస్వాదించాలన్నా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

రోజులో గంట.. మీ ఆరోగ్యం కోసం..

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేందుకు ఎక్కువ సమయం అవసరం లేదని.. రోజులో ఒక గంట కేటాయించడం ద్వారా మంచి మార్పు తీసుకురావచ్చని ధోనీ సూచించారు. "అన్నింటికంటే ముఖ్యమైనది మీపై మీరు పెట్టుకునే పెట్టుబడి. 24 గంటల్లో ఒక గంటను మీ కోసం కేటాయించండి" అని అన్నారు. వ్యాయామంతోపాటు ఆహారపు అలవాట్లను కూడా మెరుగుపరచుకోవాలని సూచించారు. శారీరక చురుకుదనం కోసం నడక, సైక్లింగ్, ఈత లేదా తమకు నచ్చిన ఏదైనా క్రీడను ఎంచుకోవచ్చని ఆయన అభిప్రాయం. క్రీడలు శారీరక దృఢత్వానికే పరిమితం కావని ధోనీ పేర్కొన్నారు. ఆటల్లో ఎదురయ్యే గెలుపోటములు జీవితంలోనూ ఉపయోగపడే ఎన్నో లక్షణాలను నేర్పిస్తాయని వివరించారు. ఓటమిని ఎలా స్వీకరించాలి? గెలిచినప్పుడు ఎలా ప్రవర్తించాలి? మనలోని లోపాలను గుర్తించి వాటిని ఎలా అధిగమించాలి? అనే విషయాలను క్రీడలు నేర్పుతాయని చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదని.. మనపై ఆధారపడినవారు, మనల్ని ప్రేమించే వారి కోసం కూడా ఆరోగ్యంగా ఉండాలని ధోనీ సూచించారు. సొంత ఆరోగ్యం కోసం సమయం కేటాయించలేకపోయినా.. కనీసం కుటుంబ సభ్యుల కోసం అయినా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.



జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళా జట్టు అద్భుత విజయం సాధించింది. హర్మన్ ప్రీత్ కౌర్(126), దీప్తి శర్మ(106) సెంచరీలతో చెలరేగారు. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్.. సిరీస్ కైవసం చేసుకుంది. అయితే తన శతకం వెనుక ఉన్న కష్టాన్ని తాజాగా హర్మన్ వెల్లడించింది. మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి జ్వరంతో ఇబ్బంది పడ్డానని, పెయిన్‌కిల్లర్స్ మాత్రలు వేసుకుని బరిలోకి దిగానని తెలిపింది.

'జింబాబ్వేతో రెండో వన్డేకు ముందు రోజు రాత్రి జ్వరంతో ఇబ్బంది పడ్డా. మ్యాచ్ ఆడేందుకు కూడా ఓపిక లేదు. విశ్రాంతి తీసుకుందామని అనుకున్నా. కానీ పెయిన్‌కిల్లర్స్ మాత్రలు వేసుకున్న తర్వాత కాస్త ఉపశమనం కలిగినట్లు అనిపించింది. ఆడాలని నిర్ణయించుకున్నా. బరిలోకి దిగి సెంచరీ చేశా. ప్రస్తుతం కెప్టెన్సీ భారం లేకుండా బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తున్నా. బ్యాటింగ్ చేసేటప్పుడు బ్యాటర్‌గానే ఆలోచించాలి. జట్టుకు అవసరమైనప్పుడు బాధ్యత తీసుకోవాలి. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాలి. జట్టు విజయమే నా అంతిమ లక్ష్యం' అని హర్మన్ వెల్లడించింది. మ్యాచ్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్‌ను.. ప్రతీకా రావల్, హర్మన్ ప్రీత్ కౌర్ గాడిలో పెట్టారు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 124 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మ కూడా అదరగొట్టింది. హర్మన్, దీప్తి కలిసి ఐదో వికెట్‌కు 153 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్: నెట్స్‌లో చెమటోడుస్తున్న కోహ్లీ.. వీడియో వైరల్

భారత జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడేసింది. కాగా నవంబర్ 4 నుంచి ఐదు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి వన్డేల్లోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచ కప్ 2027 లక్ష్యంగా ఆడుతున్న కోహ్లీ.. కివీస్‌తో సిరీస్ కోసం ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. నెట్స్‌లో వైట్ బాల్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వచ్చే నెల 4 నుంచి భారత్–న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం కోహ్లీ ఇంకా న్యూజిలాండ్‌కు బయలుదేరలేదు. అయితే అంతకుముందే ప్రాక్టీస్‌ను ముమ్మరం చేశాడు. వైట్‌బాల్‌తో షాట్లు ఆడుతూ, తన ఆటకు పదును పెడుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన ఈ స్టార్ బ్యాటర్.. కివీస్‌తో సిరీస్‌లో ఎలా రాణిస్తాడనే ఆసక్తి నెలకొంది.

భువీ.. విమర్శలను పట్టించుకోవద్దు : మోర్నీ మోర్కెల్

భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కీలక సూచనలు చేశాడు. విమర్శలను పట్టించుకోకుండా తన సహజమైన ఆటను కొనసాగించాలని తెలిపాడు. నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి భువీ రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్‌తో జరిగిన రెండు టీ20ల్లో తుది జట్టులో చోటు దక్కినప్పుడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారీగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. దీంతో భువీపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి వచ్చిన ప్లేయర్‌పై సహజంగానే అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఐపీఎల్‌లో భువీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. షెడ్యూల్ కారణంగా పరిమిత సమయం వరకే ప్రాక్టీస్ ఉంటుంది. తక్కువ సమయం వ్యవధిలోనే అంతర్జాతీయ మ్యాచ్‌లకు సిద్ధం కావాల్సి ఉంటుంది. భువనేశ్వర్ తన ఆటను తిరిగి అందిపుచ్చుకోవడానికి కొంత సమయం ఇవ్వాలి. జట్టులోకి వచ్చినప్పటి నుంచే నేను అతడికి చెప్పింది ఒక్కటే.. దేనికోసమూ పరుగులు పెట్టొద్దు. నీ సహజమైన ఆటను నువ్వు వాడు. బయట నుంచి వచ్చే విమర్శలు, అంచనాలను పట్టించుకోవద్దు' అని మోర్కెల్ వెల్లడించాడు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480